సిద్దిపేట

నమస్తే తెలంగాణ

ఆదివారం 2 మార్చి 2025

SUNDAY, MARCH 2, 2025

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ మను చౌదరి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట అర్బన్, మార్చి 1: ఎంఎన్ఆర్ఈజీఎస్‌లో చేపట్టిన సీసీ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మరుగుదొడ్లు, డ్రైనేజీలు, గ్రామపంచాయతీ భవనాలు తదితర నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ మను చౌదరి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఈజీఎస్‌లో చేపట్టిన పనుల ప్రగతిపై అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో వసతుల పెంపుదలకు చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని, పూర్తయిన వాటి ఎంబీ రికార్డు చేయాలన్నారు. ఇంకా నిర్మాణాలు ప్రారంభించని వాటిని వెంటనే ప్రారంభించి వారం రోజుల్లోగా నిర్మాణ ప్రగతిని చూపించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, పంచాయతీరాజ్ ఈఈలు శ్రీనివాస్‌రెడ్డి, చిరంజీవి, డీఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని అంతం చేయాలి

– అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట అర్బన్, మార్చి 1: జిల్లాలో డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని అంతం చేయాలని, ముఖ్యంగా ఎక్కడి నుంచి రవాణా అవుతుందో నిఘా పెట్టాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో రోడ్డు భద్రత కమిటీ, మత్తు పదార్థాల నివారణకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో డ్రగ్స్ అవగాహన వీడియోలు, ఫొటోలతో ప్రచారం చేయాలని, విద్యాసంస్థల్లో డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. డ్రగ్స్ బారిల పడినా, పిల్లల ప్రవర్తనలో తేడా వచ్చినా వారి గురించి తెలియజేయడానికి టోల్ ఫ్రీ నెంబర్: 1908, 8712671111, 08457-14446 కాల్ చేయాలన్నారు. రహదారుల వెంబడి డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్‌పై అధికారులు కఠినంగా వ్యవహరించడం కాకుండా, కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆయన సూచించారు. జిల్లాలో ఎక్కడ కూడా రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఆర్టీసీ, పోలీస్ సిబ్బంది సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ డీఈ వెంకటేశ్వర్, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కోటి తలంబ్రాల దీక్షలో భాగస్వాములు కావాలి

కోటి తలంబ్రాల దీక్షను ప్రారంభిస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మార్చి 1: కోటి తలంబ్రాల దీక్షలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, రాములోరి తలంబ్రాల తయారీలో అందరికీ అవకాశం లభించడం అదృష్టంగా భావించాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం కోటి తలంబ్రాల దీక్షను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో మూడోసారి తలంబ్రాల తయారీలో గజ్వేల్ వాసులకు అవకాశం రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, రామకోటి భక్త సమాజం వ్యవస్థాపకుడు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

అలయన్స్ సేవలు అభినందనీయం

సిద్దిపేట టౌన్, మార్చి 1: అలయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ఆ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బాలగంగాధర్‌శాస్త్రి అన్నారు. సిద్దిపేట అలయన్స్ క్లబ్ సేవా విజయోత్సవ సభ శనివారం స్థానిక రైస్‌మిల్లు అసోసియేషన్‌లో జరిగింది. అంతకు ముందు అభయజ్యోతి దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాలు చేసిన క్లబ్ సభ్యులకు బహుమతులు అందజేసి సత్కరించారు. క్లబ్ ప్రతినిధులు ఆత్మరాములు, ఈశ్వర్‌చరణ్, వనజ, వెంకటేశం, వైకుంఠం, అనంతయ్య, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అలయన్స్ సేవా విజయోత్సవ సభలో క్లబ్ ప్రతినిధులు

స్టీల్ బ్యాంకును సద్వినియోగం చేసుకోవాలి

దుబ్బాక,మార్చి 1: దుబ్బాక పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టీల్ బ్యాంకును సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని స్టీల్ బ్యాంకును ఆయన పరిశీలించారు. స్టీల్ బ్యాంకు నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సిబ్బంది ప్రవీణ్, మెప్మా సీవో రేణుక ఉన్నారు.

నేడు ‘మల్లన్న’ ఏడో ఆదివారం

చేర్యాల, మార్చి 1: కొమురవెల్లి బ్రహ్మోత్సవాల్లో నేడు ఏడో ఆదివారం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. వరంగల్, మెదక్, కరీంనగర్, నిజామాబాద్ తదితర పూర్వ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. కొమురవెల్లి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకోవడంతో పాటు మొక్కులు చెల్లించుకోనున్నారు.భక్తులు మల్లన్నకు బోనం సమర్పించి పట్నం వేసి మొక్కులు సమర్పించుకోనున్నారు.మరికొందరు భక్తులు మల్లన్నను దర్శనం చేసుకొని, మల్లన్న గుట్టపైన ఎల్లమ్మకు బోనం చేసి మొక్కులు తీర్చుకోనున్నారు. కొండపోచమ్మ, నల్లపోచమ్మ ఆలయాలకు తరలివెళ్లి అక్కడ బోనాలు సమర్పించనున్నారు. కొమురవెల్లి మల్లికార్జునస్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం అన్ని వసతులు కల్పిస్తున్నామని మల్లన్న ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు.

అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే పల్లా

చేర్యాల, మార్చి 1 : మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాల కోసం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రూ.80 లక్షలు మంజూరు చేయించి తనదైన ముద్ర వేసుకున్నాడని, చేర్యాల ప్రాంత అభివృద్ధి ప్రదాత అని ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పెడతల ఎల్లారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు గూడూరు బాలరాజు, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలుయాదవ్, యూత్ మండల అధ్యక్షుడు ఆకుల రాజేశ్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే నిధులు విడుదల చేయించిన సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాటల ఎమ్మెల్యే కాదని చేతల ఎమ్మెల్యే అని గుర్తుచేశారు.ప్రతిపక్షంలో ఉన్నా ప్రజాసమస్యల పై ఎప్పటికప్పుడు సంబంధితశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులను కలిసి చేర్యాల ప్రాంతానికి నిధులు మంజూరు చేయిస్తున్నట్లు తెలిపారు. సొంత దవాఖానలో ఉచిత వైద్యం, మందులు, పరీక్షలు చేయిస్తున్న ఎమ్మెల్యేకు ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటారన్నారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన వారిలో ఎర్రోళ్ల యాదగిరి, బంగారిగళ్ల కిరణ్‌కుమార్, రాజబాబు, ముచ్చాల వంశీ ఉన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు

చేర్యాల, మార్చి 1 : పట్టణంలోని పెద్దమ్మగడ్డ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతున్న 30 మంది విద్యార్థులకు లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ దీపాంజలి ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్‌ను శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని, కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు.కార్యక్రమంలో ఎంఈవో ఆర్.కిష్టయ్య, లయన్స్‌క్లబ్ సభ్యులు మంచాల కొండయ్య, పూర్వపు విద్యార్థి బూరగోని తిరుపతిగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి

పీస్ కమిటీ సమావేశంలో పాల్గొన్న సీఐలు సైదా, మురళి

గజ్వేల్, మార్చి 1: శాంతియుత వాతావరణంలో రంజాన్ పండుగ జరుపుకోవాలని సీఐలు సైదా, మురళి తెలిపారు. శనివారం కోలా అభిరామ్ గార్డెన్‌లో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. నేటి నుంచి రంజాన్‌మాసం మొదలవుతుందన్నారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చౌరస్తాల వద్ద పండ్లు అమ్ముకోవాలన్నారు. రాత్రి సమయంలో పిల్లలు రాష్ డ్రైవింగ్ చేస్తున్నారని, పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, రాష్ డ్రైవింగ్‌పై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, విద్యుత్ ఏఈ మారుతి, ముస్లింలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న రాజేందర్‌రెడ్డి

కొమురవెల్లి, మార్చి 1: మండలంలోని పోసాన్‌పల్లికి చెందిన సాకలి మల్లేశం అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను శనివారం బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి పరామర్శించడంతో పాటు రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బుడిగె రమేశ్ గౌడ్, బూరుగు వంశీ, విరాట్‌బాబు, ఎంబీ.వెంకటేశ్, ఎంబీ.సురేందర్, శ్రీకాంత్, లక్ష్మణ్, ముత్తయ్య, కనకయ్య, శ్రీకాంత్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షప్యాడ్లు అందజేత

టెన్త్ ఫలితాల్లో కొమురవెల్లి మండలాన్ని అగ్రస్థానంలో నిలుపాలని బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బొంగు రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఐనాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన టెన్త్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు తదితర సామగ్రి అందజేశారు. మండల స్థాయిలో ఎక్కువ మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.10,116, ద్వితీయ స్థానం విద్యార్థికి రూ.5,116 అందజేస్తానని ఆయన తెలిపారు. గురువన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బీఆర్ఎస్ మండల యూత్ నాయకుడు మకిలి నవీన్ టెన్త్ విద్యార్థులకు జామెట్రీ బాక్సులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యుడు గజ్జె వెంకటేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయోగాత్మక విద్య ఎంతోమేలు

- డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

బోధన ఉపకరణాలను పరిశీలిస్తున్న డీఈవో, అధికారులు

చేర్యాల, మార్చి 1: ప్రయోగాత్మక విద్య విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నదని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయిలో టీచర్ లెర్నింగ్ మెటీరియల్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సైన్స్,గణితం, ఇంగ్లిష్, ఎన్విరాన్‌మెంట్ సైన్స్‌పై ప్రయోగాలు, పాఠ్యాంశాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కనీస సామర్థ్యాలు సాధించడంతో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు టీఎల్ఎం ఉపయోగిస్తూ బోధన చేయాలని సూచించారు. అనంతరం మండలంలోని వివిధ స్కూళ్లకు చెందిన ఉపాధ్యాయులు ఉపయోగిస్తున్న టీచర్ లెర్నింగ్ మెటీరియల్‌ను డీఈవో పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో కిష్టయ్య, జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు నర్సింహులు, రామస్వామి, రంగనాథ్, భాస్కర్, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ఐలయ్య, నాగమణి, పీవీ చంద్రశేఖర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడిబాట కోసం హద్దులు ఏర్పాటు

హైస్కూల్ బాట కోసం హద్దులు ఏర్పాటు చేయిస్తున్న తహసీల్దార్ మధుసూదన్

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 1: గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలనే ఉద్దేశంతో 20 ఏండ్ల క్రితం ఐటీడీఏ ఆధ్వరంలో ధూళిమిట్ట మండలంలోని రెడ్యానాయక్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలో డీఏస్టీ(డీనోటిఫైడ్) గవర్నమెంట్ హైస్కూల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అప్పట్లో పాఠశాల నిర్మాణం కోసం స్థానికులు భూమిని విరాళంగా అందజేశారు. కాలక్రమంలో హైస్కూల్ చుట్టూ ఇండ్ల నిర్మాణాలు చేపట్టారు. దీంతో హైస్కూల్‌కు వెళ్లేందుకు బాట లేకుండా పోయింది. 20 ఏండ్లుగా బడికి వెళ్లేందుకు కావాల్సిన బాట కోసం విద్యార్థులు పోరాటాలు చేశారు. బాట కోసం విద్యార్థులు పడుతున్న బాధలకు ధూళిమిట్ట తహసీల్దార్ సింహాచలం మధుసూదన్ చూసి చలించిపోయారు. బడి బాట కోసం ప్రత్యేకంగా చొరవ చూపించి, భూ యజమానులను ఒప్పించారు. శనివారం తహసీల్దార్ రెవెన్యూ అధికారులతో కలిసి గ్రామాన్ని సందర్శించి బడిబాట కోసం హద్దులు ఏర్పాటు చేశారు. బడిబాట కోసం ప్రత్యేకంగా కృషి చేసిన తహసీల్దార్‌కు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 1: విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కుకునూరుపల్లి మండలంలోని చిన్నకిష్టాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం బండి అశోక్ మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తెమట్టెలు పంపిణీ

గజ్వేల్, మార్చి 1: మండలంలోని కొల్గూర్ గ్రామానికి చెందిన పురం ఆంజనేయులు కూతురు అలేఖ్య పెండ్లికి కొండపోచమ్మ ఆలయ కమిటీ మాజీ డైరెక్టర్ గౌలి సంతోష్ గుప్తా శనివారం పుస్తెమట్టెలు అందజేశారు. మాజీ ఎంపీటీసీ గొడుగు జ్యోతిస్వామి, పురం ఆంజనేయులు పాల్గొన్నారు.

పంటల బీమా పథకం అమలు చేయాలి

సమావేశంలో మాట్లడుతున్న రామలింగారెడ్డి

సిద్దిపేట టౌన్, మార్చి 1: ప్రభుత్వం తక్షణమే పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మారెడ్డి రామలింగారెడ్డి డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట నష్టం జరిగినపుడు పూర్తిస్థాయిలో పరిహారం అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట రుణమాఫీ కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం పక్కాగా పంటల బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నేతలు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, దేవేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, యాదంరావు, సంతోష్‌రెడ్డి, భూపతిరెడ్డి పాల్గొన్నారు.

మార్కెట్ పాలకవర్గం పాత్రపై విచారణ జరపాలి

హుస్నాబాద్, మార్చి 1: హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో జరిగిన అక్రమాలపై కేవలం ఒక అధికారిని సస్పెండ్‌చేసి చేతులు దులుపుకోవడం కాదని, వెంటనే స్థానికంగా ఉన్న వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం, అధికారుల పాత్రపై కూడా విచారణ జరపాలని బీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి ప్రకటనలో డిమాండ్ చేశారు. అక్రమ పర్మిట్లు, ఫోర్జరీ సంతకాలు చేయడంతో పాటు అక్రమంగా వేలాది ఎకరాల్లో పత్తి పంట సాగు చేసినట్లు నమోదు చేసి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పత్తిని సీసీఐలో విక్రయించారని, ఈ వ్యవహారంలో లక్షలాది రూపాయలు చేతులు మారాయని ఆరోపించారు. బయట మార్కెట్‌లో తక్కువ ధరకు కొనుగోలు చేసిన పత్తిని కొందరు దళారులు వ్యవసాయ, మార్కెట్ అధికారుల సహకారంతో సీసీఐలో విక్రయించి అధిక లాభాలు పొందారన్నారు. కొందరు వ్యక్తులు ఇందులో దళారులుగా వ్యవహరిస్తూ లక్షలు సంపాదించారని, వీరు వ్యవసాయాధికారులను బ్లాక్‌మెయిల్ చేయగా వినకపోవడంతో ఏఈవోల ద్వారా జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయించారన్నారు. వ్యవసాయ, మార్కెట్ అధికారులు, మార్కెట్ పాలకవర్గం, దళారుల పాత్రపై విచారణ చేసి అసలు దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

పుస్తకాలు అందజేస్తున్న నమోజు బాలచారి

గజ్వేల్, మార్చి 1: ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి డాక్టర్ నమోజు బాలచారి, డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణపతిరావు అన్నారు. శనివారం కళాశాలలో నేషనల్ బుక్ ట్రస్టు ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో పుస్తక కార్యశాలను ప్రారంభించారు. నేషనల్ బుక్ ట్రస్టు తెలుగు సంపాదకుడు డాక్టర్ పత్తిపాక మోహన్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ వినియోగంతో బుక్ కల్చర్‌పోయి లుక్ కల్చర్ వచ్చిందన్నారు. ఇలాంటి పరిణామాలతో సమాజానికి చేటు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రఘు, బాలసాహితీవేత్త అశోక్, డాక్టర్ ఆర్.మహేందర్‌రెడ్డి, భవానీ, వెంకటేశ్, శైలజ పాల్గొన్నారు.

పారదర్శకంగా విధులు నిర్వహించాలి

- సిద్దిపేట సీపీ అనురాధ

త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేట అర్బన్, మార్చి 1: పోలీస్ అధికారులు, సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వహించాలని, ప్రజల సమస్యలు పరిష్కరించడానికి అందుబాటులో ఉండాలని సిద్దిపేట సీపీ అనురాధ సూచించారు. శనివారం సిద్దిపేట పట్టణ శివారులోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్, సీసీఎస్ పోలీస్ స్టేషన్, పోలీస్ కన్వెన్షన్ సెంటర్, నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ పెట్రోల్ పంపును ఆమె సందర్శించారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ చుట్టూ, పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉన్నందున సీఐ విద్యాసాగర్, సిబ్బందిని సీపీ అభినందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి క్రైమ్ రేటు తగ్గించాలన్నారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, గంజాయి ఇతర మత్తు పదార్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న దొంగతనాల కేసులను ఛేదించే విధంగా కృషిచేయాలని సీసీఎస్ పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ మధు, సీసీఎస్ ఏసీపీ యాదగిరి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు విష్ణుప్రసాద్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

యూపీఎస్‌పై యుద్ధభేరిని విజయవంతం చేయాలి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీఎస్‌సీపీఎస్‌ఈయూ నాయకులు

సిద్దిపేట అర్బన్, మార్చి 1: ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలు చేయనున్న ఏకీకృత పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా నేడు హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో జరిగే యూపీఎస్‌పై యుద్ధభేరిని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కురాకుల శ్రీనివాస్ కోరారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని అర్బన్ ప్రెస్ క్లబ్ వద్ద ఆయన మాట్లాడారు. యూపీఎస్ పేరుతో ఉద్యోగుల భవిష్యత్‌ను కేంద్రం కార్పొరేట్లకు తాకట్టు పెడుతుందని.. దీనివల్ల ఉద్యోగుల జీవితాలు మరింత దుర్భరమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. యూపీఎస్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం యుద్ధభేరి పోస్టర్‌ను టీఎస్‌సీపీఎస్‌ఈయూ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా నాయకులు మాడుగుల శ్రీనివాస్, నర్మద, రాజేశం, ఇస్మాయిల్, జోహన్ పాల్గొన్నారు.

అమరుల త్యాగం వృథాకాదు



చేర్యాలలో అమరుల ఫ్లెక్సీకి నివాళులర్పిస్తున్న మల్లిగారి యాదయ్య

సిద్దిపేట అర్బన్: అమరుల ఫ్లెక్సీకి నివాళులర్పిస్తున్న నాయకులు

హుస్నాబాద్‌టౌన్, మార్చి 1: ఎస్సీ వర్గీకరణ కోసం అమరత్వం పొందిన వీరుల త్యాగం వృథా కాదని మాజీ కౌన్సిలర్ గాదపాక రవీందర్ అన్నారు. హుస్నాబాద్ అంబేద్కర్‌చౌరస్తాలో శనివారం మాదిగ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30ఏళ్లుగా ఎస్సీవర్గీకరణ అమలు కోసం ఎందరో వీరులు తమ ప్రాణాలు అర్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరుల త్యాగాలు వృథాకాకుండా వర్గీకరణను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు స్థానిక అంబేద్కర్ కాలనీలో జరిగిన అమరవీరుల సంస్మరణ సభలో పలువురు అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు వెంకటస్వామి, సంపత్, సుధాకర్, చంద్రమౌళి, హరీశ్, కొమురయ్య, రవీందర్, సంపత్ పాల్గొన్నారు.

అమరులకు నివాళులర్పించిన నాయకులు

సిద్దిపేట అర్బన్, మార్చి1: మూడు దశాబ్దాల వర్గీకరణ పోరాటంలో అమరుల త్యాగాలు వృథాగా పోవని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పెర్క పరశురామ్ అన్నారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్ నాయకులు అమరవీరులకు నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీనివాస్, ఇస్తారి, మల్లేశం, శ్రీహరి, ప్రసాద్ పాల్గొన్నారు.

ధూళిమిట్టలో..

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 1: ధూళిమిట్టలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నల్ల రాజేశ్ ఆధ్వర్యంలో అమరవీరుల దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద అమరులకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు భాస్కర్ మాట్లాడారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి సంపత్, నాయకులు కనకస్వామి, కిష్టయ్య, చందర్, ఎల్లయ్య, శ్రీనివాస్, కనకరాజు, సంపత్, సుధాకర్, రాజు, వీరయ్య, పోచయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

బెజ్జంకిలో

బెజ్జంకి, మార్చి 1: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు పరశురాములు, బీసీ సంఘ నాయకులు శ్రీనివాస్ గౌడ్, రాజేశంగౌడ్, వంగాల నరేశ్, నాయకులు లక్ష్మణ్, తిరుపతి, పరశురాములు, బాలనర్సు, భూమయ్య, రూపేశ్, మధు, కొమురయ్య, రాజు, చంద్రయ్య పాల్గొన్నారు.

చేర్యాలలో..

చేర్యాల, మార్చి 1 : ఎస్సీ వర్గీకరణ కోసం అమరులైన ఎమ్మార్పీఎస్, ఎంఎస్సీ నాయకుల త్యాగాలు మరువలేనివని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మల్లిగారి యాదయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంగడి బజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగ అమరుల ఫ్లెక్సీకి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి సనవాల ప్రసాద్, మండలాధ్యక్షుడు సింగపాక బాబు, టౌన్ అధ్యక్షుడు భూమిగారి మధుకర్, మల్లిగారి నర్సింహులు, ఎర్రోళ్ల శ్రీనివాస్, కర్రోళ్ల కిష్టయ్య, నాగరాజు, కిషన్ పాల్గొన్నారు.

మాదిగ అమరులకు నివాళి

తొగుట.మార్చి 1: మండలంలోని లింగాపూర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగ అమరులకు ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు ముత్యంపేట డెవిడ్‌రాజు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పోరులో అసువులు బాసిన మాదిగ అమరులకు ఉద్యమాభివందనాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పరశురాములు, నాగరాజు, కృష్ణ,రమేశ్, సాయిలు, ప్రవీణ్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

వల్లంపట్లలో క్రీడాకారులను సన్మానిస్తున్న డాక్టర్ దయానంద్

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 1: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ బోయిని దయానంద్ అన్నారు. ఇటీవల జనగామ జిల్లా రఘునాథపల్లిలో జరిగిన ఓపెన్ సర్కిల్ క్రికెట్ టోర్నీలో మద్దూరు మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన క్రీడాకారులు ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. శనివారం వల్లంపట్లలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్, మాజీ ఉపసర్పంచ్ వేల్పుల రమేశ్, క్రీడాకారులు ఎండీ రజాక్, మల్లేశం, పవన్, రాజేశ్, భువన్, సాయికిరణ్, సాయిచరణ్, విజయ్, వినయ్, రంజిత్ పాల్గొన్నారు.

ట్రాక్టర్స్ అండ్ జేసీబీ ఓనర్స్ కార్యవర్గం ఎన్నిక

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 1: కొండపాక మండలంలోని దుద్దెడలో శనివారం ట్రాక్టర్స్ అండ్ జేసీబీ ఓనర్స్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చిలుముల శివకుమార్, అధ్యక్షుడిగా వేముల కనకయ్య, ఉపాధ్యక్షులుగా పుట్ట మల్లేశం, దోమల మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా అక్బర్, కోశాధికారిగా చిలుముల పరశురాములు, సహాయ కార్యదర్శిగా ఉనుగూరి జైపాల్, సలహాదారులుగా పుట్ట కనకయ్య, పంజ కనకయ్య, మల్లేశం, ఆంజనేయులు, శ్రీశైలం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వాటికి దూరంగా ఉండాలి

కొమురవెల్లి, మార్చి 1: విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని కొమురవెల్లి ఎస్సై లింగంపల్లి రాజు సూచించారు. శనివారం మండలంలోని మర్రిముచ్చాలలో విద్యార్థులకు సైబర్ నేరాలతో పాటు మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ కీలకమని, సక్రమ మార్గంలో వెళ్లేవారు ఉన్నతస్థాయికి చేరుకుంటారన్నారు. అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దని, తెలిసీ తెలియని వయసులో ప్రేమ పెండ్లి అంటూ జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజయ్య, ఉపాధ్యాయులు, షీటీమ్ సభ్యులు పాల్గొన్నారు.

వివాహిత మృతి

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 1: పరిస్థితి విషమించి వివాహిత మృతి చెందింది. ఈ ఘటన మద్దూరు మండలం ధర్మారంలో చోటు చేసుకుంది. ఎస్సై షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొండూరు కనకయ్యతో ప్రజ్ఞాపూర్‌కు చెందిన స్వప్న(30)కు 2023లో వివాహం జరిగింది. వీరికి పిల్లలు పుట్టకపోవడంతో పాటు స్వప్న అనారోగ్యానికి గురైంది. దీంతో మనస్తాపం చెందిన ఆమె గత నెల 23న సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స కోసం ఆమెను వంటిమామిడిలోని ఆర్వీఎం దవాఖానకు తరలించగా పరిస్థితి విషమించి శనివారం మృతిచెందింది. మృతురాలి సోదరుడు యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి కలిగి ఉన్న యువకుల అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న సీఐ

చేర్యాల, మార్చి 1: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు పరిసరాల్లో గంజాయి కలిగి ఉన్న ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీను తెలిపారు. శనివారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. చేర్యాల పట్టణానికి చెందిన నీల చందు, జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన ఏనుగల బాబు, మహంకాళి రాజేశ్ హైదరాబాద్ నగరంలోని దూల్‌పేట నుంచి గంజాయి తీసుకువచ్చి వారు తాగడంతో పాటు ఇతరులకు విక్రయిస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. ముగ్గురు యువకుల వద్ద 198 గ్రాముల గంజాయి ప్యాకెట్లు లభించాయని,వారు పారిపోయేందుకు యత్నిస్తే వెంబడించి పట్టుకున్నట్లు తెలిపారు.వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నామని, సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై నిరేశ్, ప్రొబేషనరీ ఎస్సై మానసరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.